నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 19 జూన్ 2025 | BHADRADRI KOTHAGUDEM

తహసీల్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా

- మణుగూరు మండలంలో అసంపూర్తి పనులు పూర్తి చేయాలని డిమాండ్
- ఆందోళనకు అనుమతి లేదని బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు

మణుగూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మణుగూరు టౌన్, జూన్ 18: అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మణుగూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం వద్దకు పార్టీ శ్రేణులు చేరుకోవడంతో కార్యక్రమానికి అనుమతి లేదని సీఐ నాగబాబు, ఎస్సై మేడా ప్రసాద్, ట్రైనీ ఎస్సై మనీషా వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని, ఈలోగా ఎన్నికలు రావడంతో కొన్ని పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం లేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే పనుల విషయంలో కాలయాపన చేస్తున్నారని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఆయా పనులన్నీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మణుగూరు అంబేద్కర్ సెంటర్ నుంచి రూ.10 కోట్ల వ్యయంతో బాంబే కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు, బాంబే కాలనీలో ఉన్న గాంధీ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం నిధులు కూడా మంజూరయ్యాయని గుర్తు చేశారు. అంబేద్కర్ సెంటర్ నుంచి చినరాయిగూడెం వరకు నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, నాయకులు యాదగిరి గౌడ్, ఆవుల నరసింహారావు, అక్కి నరసింహారావు, వేల్పుల సురేశ్, ప్రభుదాస్, ఎడవల్లి వెంకటయ్య, జావీద్, బాషా, మేకల రవి, మడి వీరన్నబాబు, సఖిని బాబురావు, కలగూర శంకర్, తురక రాంకోటి, కమ్మపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాన జాడ ఏది?

ఆకాశంవైపు ఆశగా చూస్తున్న అన్నదాతలు
ఇప్పటికే పలుచోట్ల విత్తనాలు విత్తి నష్టపోయిన రైతులు
ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తున్న వరుణుడు
మృగశిరలోనూ దంచికొడుతున్న ఎండలు
నేటివరకు 'ఖమ్మం'లో 47 వేల ఎకరాల్లో సాగు పనులు

సీజన్ ప్రారంభమై పక్షం రోజులు దాటినప్పటికీ ఈ ఏడాది వాన జాడ కనిపించడం లేదు. దీంతో ఇప్పటికే విత్తనాలు విత్తుకున్న రైతులు, విత్తనాలు తెచ్చి పెట్టుకున్న అన్నదాతలు వాన కోసం ఆకాశంవైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ వానకాలం నైరుతీ రుతుపవనాలు మే నెల చివరిలోనే రాష్ట్రాన్ని తాకాయి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం తథ్యమని వాతావరణ శాఖ గత రెండు నెలల ముందుగానే ప్రకటన చేసింది. గతంలో కురవనన్ని వర్షాలు కురుస్తాయని కొందరు అధికారులు సైతం అనేకమార్లు ప్రకటించారు. దీంతో అన్నదాతలు పులకరించిపోయారు. వ్యవసాయ పనులు ముందస్తుగానే ప్రారంభించుకోవచ్చని సంబురపడ్డారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా రైతులు వానకాలం సాగుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. కానీ.. పరిస్థితి మాత్రం అనుకున్నదానికి విరుద్ధంగా కనిపిస్తున్నది. పైగా ఎండాకాలం కొట్టినట్టే ఎండలు దంచికొడుతున్నాయి. మృగశిర కార్తె ముగింపునకు వచ్చినా రుతుపవనాల జాడ కరువైంది. దీంతో అన్నదాతలు వర్షాల కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. వరుణుడు కరుణించకపోవడంతో కలవరపడుతున్నారు.

– ఖమ్మం రూరల్, జూన్ 18

ఈ ఏడాది వానకాలం సీజన్‌లో ఖమ్మం జిల్లావ్యాప్తంగా వివిధ రకాల పంటలకు సంబంధించి వేల ఎకరాల్లో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. గడిచిన ఏడాది భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలకు నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఏడాది ఆ లోటును పూడ్చుకునేందుకు జిల్లా రైతాంగం ఎంతో ఉత్సాహంగా సాగుకు శ్రీకారం చుట్టారు. దీనికితోడు నైరుతీ రుతుపవనాలు ముందస్తుగా రావడం, సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు ప్రకటించడంతో పదిరోజుల ముందుగానే వ్యవసాయ పనులు ప్రారంభించారు. మే నెల ఆరంభంలోనే వాణిజ్య, అపరాల సాగుకు దుక్కులు దున్నుకున్నారు. రుతుపవనాల రాక ప్రారంభంలో ఓ మోస్తారు వర్షాలు పడడంతో ఇదే అదునుగా భావించి పత్తి విత్తనాలను సైతం విత్తుకున్నారు. మరికొందరు వరి సాగుకు సంబంధించి నారుమడులను సైతం సిద్ధం చేసుకున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా నేటివరకు జిల్లా వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం వరి సాగు (వెదజల్లే పద్ధతి) 750 ఎకరాలు, మక్క సాగు విస్తీర్ణం 25 ఎకరాలు, పెసర 1,351 ఎకరాలు, పత్తి 23,236 ఎకరాలు, జనుము 450 ఎకరాలు, పిల్లిపెసర 10 ఎకరాలు, జీలుగ 24,538 ఎకరాలతోపాటు మరో 7,191 ఎకరాల సాగు విస్తీర్ణంలో వరి నారుమళ్లు పోసుకున్నారు. మొత్తంగా 47,551 ఎకరాల్లో సాగు పూర్తయ్యింది. గడిచిన రెండు, మూడు రోజుల్లో మరో 20 ఎకరాల్లో రైతులు విత్తనాలను విత్తుకున్నారు. దీంతో సదరు రైతులు పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరు బావులు, ఇతర నీటి వనరుల సహాయంతో తడికట్టి బతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు. విత్తిన పొలాల్లో సగానికి సగం మొక్కలు చనిపోవడంతో వాటి స్థానంలో కొత్త విత్తనాలను నాటుకుంటున్నారు.

జూన్ నెల సాధారణ వర్షపాతం	128.4 మిల్లీమీటర్లు
నేటివరకు నమోదైన వర్షపాతం	30.7 మిల్లీమీటర్లు
ఇప్పటివరకు సాగైన పంటల విస్తీర్ణం	47,551 ఎకరాలు

వర్షాలు రాకుంటే అంతా నష్టమే..

ఆవిటి

మొదట్లో వానలు రావడంతో అప్పటికే దుక్కి చేసుకొని ఉన్న పొలంలో పత్తి విత్తనాలు నాటుకున్నాం. నాలుగు ఎకరాల్లో విత్తనాలు వేసి పదిహేనురోజులు అవుతున్నది. వానలు కురువకపోవడంతో సగానికి సగం విత్తనాలు మొలకెత్తలేదు. ఇప్పటికే రూ.25 వేలు పెట్టుబడి పెట్టాను. మరో రెండు ప్యాకెట్లు కొని మొలకెత్తని విత్తనాల వాటి స్థానంలో మళ్లీ పెట్టాం. ఇప్పుడు వాటిని బతికించుకునేందుకు మూడు రోజులుగా వరుస తడులు కడుతున్నాను. వరుణ దేవుడి కటాక్షం ఉంటేనే బయటపడతాం. లేదంటే మరింత నష్టం తప్పదు.

– అంగిరేకుల వెంకన్న, రైతు, ముత్తగూడెం, ఖమ్మం రూరల్

కలెక్టరేట్ ఎదుట రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన

సాగర్ కాల్వలు బాగు చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు, రైతులు

వైరాటౌన్, జూన్ 18: సాగర్ కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని, రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ సాగర్ కాల్వలు దెబ్బతినడంతో జిల్లాలోని చివరి ఆయకట్టు భూములకు నీరందడం లేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి రైతు భరోసా, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయడంతోపాటు నకిలీ విత్తనాల సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు గుడ్డూరి ఉమ, తాళ్లూరు రమేశ్, కోలేటి ఉపేందర్, మల్లెంపాటి రామారావు, కందుల భాస్కర్‌రావు, యనమద్ది రామకృష్ణ, బోడేపూడి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థకు జాతీయ పురస్కారం

మెగా పరిశ్రమల విభాగంలో తృతీయ బహుమతి

కొత్తగూడెం సింగరేణి, జూన్ 18 : ఆర్థికపరమైన అంశాల్లో సంస్కరణలు తీసుకురావడం, వ్యయ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినందుకుగాను ప్రతిష్టాత్మక సంస్థ అయిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) ఏటా ప్రదానం చేసే జాతీయ స్థాయి పురస్కారానికి సింగరేణి సంస్థ ఎంపికైంది. వ్యయ నియంత్రణను ప్రశంసిస్తూ మెగా పరిశ్రమల విభాగంలో 2024 సంవత్సరానికిగాను నేషనల్ అవార్డు ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్ తృతీయ బహుమతికి సింగరేణిని ఎంపిక చేసినట్లు ఐసీఎంఏఐ అధ్యక్షుడు సీఎంఏ బిభూతి భూషణ్ నాయక్ పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని, అదేరోజు ఉదయం విజ్ఞాన భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా పాల్గొనే 12వ జాతీయ విద్యార్థుల స్నాతకోత్సవంలో బహుమతి గ్రహీతలు కూడా పాల్గొనాల్సిందిగా కోరారు. కాగా.. సంస్థ చైర్మన్‌గానే కాకుండా డైరెక్టర్ ఫైనాన్స్‌గా ఏడేళ్లుగా విశేష సేవలు అందిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం సంస్థలో ఖర్చు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

గ్రామసభలో మాట్లాడుతున్న భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, జూన్ 18: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన 'ధర్తి అబా జన్ భాగిదారి' కార్యక్రమంపై కృష్ణసాగర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో పీవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పథకం కింద ఏజెన్సీ ప్రాంతంలోని 130 పంచాయతీలను ఎంపిక చేశారని, అందులో కృష్ణసాగర్ పంచాయతీ ఉందన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు ఉండాలని, వాటిని అధికారులే వచ్చి గ్రామస్తుల సమక్షంలో అందిస్తారని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలకు అవసరమైన కార్డులు రిజిస్ట్రేషన్ చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పీవో గిరిజనులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో బాలయ్య, ఏవో శంకర్, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, ఆర్ఐ నర్సింహారావు, ట్రాన్స్‌కో ఏఈ గుర్రం ఉపేందర్, మోరంపల్లి బంజర్ వైద్యురాలు లక్ష్మీసాహితి, ఐకేపీ ఏపీఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పట్టివేత.. ఐదుగురు అరెస్ట్

పట్టుబడిన విత్తనాలను చూపుతున్న సీఐ, ఎస్సై

చంద్రుగొండ, జూన్ 18: అనుమతి లేకుండా గ్రామాల్లో విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి హెచ్చరించారు. చంద్రుగొండ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుజాతనగర్‌కు చెందిన భూక్యా శివ నాగ్, సాయిదుర్గాప్రసాద్, యోగినాథ్, బెండాలపాడు గ్రామస్తులు కానం అన్వేషన్, వీరభద్రం కలిసి ఈ నెల 17(మంగళవారం)న చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో అనుమతి లేకుండా పత్తి, మిరప విత్తనాలను విక్రయిస్తున్నారు. వారిని వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో పోలీసులు పట్టుకున్నారు. 105 పత్తి విత్తనాల ప్యాకెట్లు, 1025 మిరప విత్తనాల ప్యాకెట్లు స్వాధీనపర్చుకున్నారు. వీటి విలువ రూ.12.75 లక్షల వరకు ఉంటుంది. సుజాతనగర్‌లో విక్రయించాల్సిన విత్తనాలను చంద్రుగొండ మండలంలో విక్రయించడంపై ఏవో వినయ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. దర్యాప్తు సాగుతున్నది.

నకిలీవని తేలితే కఠిన చర్యలు

ఈ విత్తనాలను పరీక్షలకు పంపిస్తామని, నకిలీవని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ, అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు తెలపాలని రైతులను కోరారు. విత్తనాల విక్రయ దుకాణాలను వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీ చేస్తామన్నారు. అనుమతి ఉన్న విత్తన కంపెనీల విత్తనాలనే రైతులు కొనాలన్నారు. ఎస్సై శివరామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

9 తగ్గి.. 22 పెరిగి..!

- భద్రాద్రి జిల్లాలో పెరిగిన మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు
- కొత్తగూడెం కార్పొరేషన్‌లో గ్రామాల విలీనంతో తగ్గిన ఎంపీటీసీల సంఖ్య
- అశ్వారావుపేట మున్సిపాలిటీ కావడంతో అక్కడ కూడా తగ్గిన స్థానాలు
- మండల పరిషత్‌గా ఆవిర్భవించిన భద్రాచలంలో 14 ప్రాదేశికాలు
- సారపాక మళ్లీ పంచాయతీ కావడంతో అక్కడ 6 స్థానాల పెరుగుదల
- కొత్తగూడెం జిల్లాలో 220 నుంచి 233కు పెరిగిన ఎంపీటీసీ స్థానాలు
- 21 నుంచి 22 చేరిన మండలాలు, పెరిగిన మరో జడ్పీటీసీ స్థానం
- 7,68,805 నుంచి 6,81,220కి తగ్గిన ఓట్లర్లు..

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి జిల్లాలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) సంఖ్య 233కు పెరిగింది. ఇప్పటి వరకూ ఈ సంఖ్య 220గా ఉంది. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను, మరో ఏడు గ్రామాలను కలిపి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడంతో అంతకుముందు ఆయా మండలాల పరిధిలో ఉన్న మూడు ఎంపీటీసీ స్థానాలు కనుమరుగయ్యాయి. అలాగే, మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న అశ్వారావుపేటను అప్‌గ్రేడ్ చేసి దానిలో మరో రెండు పంచాయతీలను విలీనం చేసి అశ్వారావుపేట మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ కూడా అంతకుముందే ఉన్న ఆరు ఎంపీటీసీ స్థానాలు కనుమరుగయ్యాయి. ఇక, మండల ప్రజా పరిషత్‌గా ఏర్పాటు చేసిన భద్రాచలంలో 14, మళ్లీ ఒకే పంచాయతీగా పునరుద్ధరించిన సారపాకలో ఆరు చొప్పున ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. గుండాల, ఆళ్లపల్లిలో కూడా ఒక్కోటి చొప్పున మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు పెరిగాయి. దీంతో జిల్లాలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 233కు చేరింది.

కొత్తగా మండలమైన భద్రాచలం మండల పరిషత్ కార్యాలయం ఇదే..

మేజర్ గ్రామ పంచాయతీ భద్రాచలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మండలంగా మార్చింది. దీంతో అక్కడ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఏర్పాటైంది. అలాగే ఇటీవలి వరకూ మండలంగా ఉన్న అశ్వారావుపేటను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది. దీంతో అశ్వారావుపేట మండల పరిషత్ తెరమరుగైంది. అక్కడి గుర్రాలగూడెం, పేరాయిగూడెం పంచాయతీలను కూడా అశ్వారావుపేట మున్సిపాలిటీలో కలిపింది. దీంతో అక్కడ ఆరు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఇక సుజాతనగర్ మండల కేంద్రంతోపాటు ఆ మండలంలోని ఏడు పంచాయతీలైన నాయకులగూడెం, మంగపేట, కోమటిపల్లి, నిమ్మలగూడెం, నర్సింహసాగర్, లక్ష్మీదేవిపల్లిలు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిశాయి. దీంతో ఇక్కడ మూడు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి.

జిల్లాలో 233కు చేరిన ఎంపీటీసీ స్థానాల సంఖ్య..

గత ఎన్నికల సమయం వరకు భద్రాచలం మండలం లేకపోవడం వల్ల జిల్లా మొత్తం 220 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాలు 233కు పెరిగాయి. అశ్వారావుపేట మండలంలో 6, సుజాతనగర్ మండలంలో 3 కలిపి మొత్తం 9 స్థానాలు తగ్గాయి. అదే సమయంలో కొత్తగా ఏర్పాటైన భద్రాచలం మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు, సారపాక పట్టణం మళ్లీ ఏక పంచాయతీగా ఏర్పడడంతో అక్కడ 6 ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. ఇక ఆళ్లపల్లి మండలంలో ఒకటి, గుండాల మండలంలో మరొకటి పెరిగాయి. ఇవన్నీ కలిపి 22 స్థానాలకు చేరడంతో జిల్లాలో మొత్తం మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల సంఖ్య 233కు చేరింది.

తగ్గిన ఓటర్ల సంఖ్య..

గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎంపీటీసీ స్థానాలు పెరిగినా ఓటర్ల సంఖ్య మాత్రం తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతంలో జిల్లాలో 7,68,805 మంది ఓటర్లున్నారు. చేర్పులు మార్పుల కారణంగా ఇప్పుడు ఓటర్ల సంఖ్య 6,81,220కు తగ్గింది. అయితే, ఎన్నికల సమయానికి కొత్త ఓటర్లు నమోదు చేసుకుంటే ఈ సంఖ్య మళ్లీ పెరిగే అవకాశం ఉంది. అయితే జిల్లాలో అదనంగా మరో జడ్పీటీసీ స్థానం కూడా పెరిగింది. అదే.. భద్రాచలం జడ్పీ స్థానం. కొత్తగా భద్రాచలం జడ్పీ స్థానం రావడంతో జిల్లాలో ఇప్పటి వరకూ ఉన్న 21 మండలాలు ఇప్పుడు 22 మండలాలు అయ్యాయి.

మారనున్న మండల కేంద్రాలు..

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, అశ్వారావుపేట మున్సిపాలిటీ ఏర్పాటు కావడంతో కొత్తగూడెం, అశ్వారావుపేట, సుజాతనగర్ మండల కేంద్రాలు కనుమరుగు కానున్నాయి. ఈ మండలాల్లో ఈ మండల కేంద్రాలు మినహా మిగిలిన గ్రామాలతో కొత్త మండల కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి..

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కావడంతో సుజాతనగర్ మండల కేంద్రం మారుతుంది. అక్కడ మండల పరిషత్ కార్యాలయానికి సొంత భవనం లేదు కాబట్టి వేరే చోట నిర్మించవచ్చు. అశ్వారావుపేటలో సొంత భవనం ఉంది కాబట్టి దానిని మార్చకపోవచ్చు. కొత్తగా భద్రాచలం మండలం కావడంతో అక్కడ ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో విభజనను పూర్తి చేశాం.

–నాగలక్ష్మి, జడ్పీ సీఈవో, భద్రాద్రి

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేతలు మృతి

- మృతుల్లో సీసీ సభ్యుడు గాజర్ల రవి, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య అరుణ
- మూడు రాష్ట్రాల్లో గాజర్ల రవిపై రూ.కోటి రివార్డు

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి (ఫైల్) | రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణ (ఫైల్) | ఏసీఎం అంజు (ఫైల్)

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 18: భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆ పార్టీ అగ్రనేతలు ముగ్గురు మృతిచెందారు. ఈ ఘటన ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం–మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గ్రేహౌండ్స్ భద్రతా దళాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు భద్రతా దళాలపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన గ్రేహౌండ్స్ బలగాలు ఎదురుకాల్పులకు దిగడంతో ఇరువర్గాల మధ్య సుమారు రెండు గంటలపాటు భీకరపోరు జరిగినట్లు తెలుస్తోంది. భద్రతా దళాల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం ఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, అంధ్రా–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్ అలియాస్ గణేశ్ అలియాస్ బిరుసు, ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు, ఏఓబీ సభ్యురాలు వెంకటరవి లక్ష్మీచైతన్య అలియాస్ అరుణ అలియాస్ రూపి కాగా.. మరొకరిని ఏరియా కమిటీ సభ్యుడు అంజాగా పోలీసులు గుర్తించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి(సీసీఎం)పై మూడు రాష్ట్రాల్లో కలిపి రూ.కోటి రివార్డు, ఏపీ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామానికి చెందిన అరుణ(ఎస్‌జెడ్‌సీఎం)పై రూ.25 లక్షల రివార్డు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 21న ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దు గరియాబంద్ జిల్లా కులరీఘాట్ దండకారణ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్యే అరుణ. శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ విడుదల చేసిన ఈమె ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం కీలకంగా వ్యవహరిస్తున్న గాజర్ల రవి, అరుణ మృతి తో ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లైంది. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలనే టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మృతి అనంతరం కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్, ఇప్పు డు గాజర్ల రవి, అరుణ వరుస ఎన్‌కౌంటర్లు ఆ పార్టీని చిన్నాభిన్నం చేసినట్లు తెలుస్తోంది.